క్లుప్తంగా

వైభవంగా పల్లకీ సేవ

మహేశ్వరం: అమావాస్య సందర్భంగా శుక్రవారం ఛత్రగిరి లక్ష్మీనర్సింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేసి ఆలయ మాఢవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం భజన, భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పూజారులు అజయ్‌శర్మ, మురళీ శర్మ, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

మానవ సేవే.. మాధవ సేవ



హోమంలో పాల్గొన్న భక్తులు

కందుకూరు: మానవ సేవే.. మాధవ సేవ అని బ్రహ్మశ్రీ గురూజీ అనిల్‌కుమార్‌జోషి అన్నారు. శుక్రవారం అమావాస్య సందర్భంగా పులిమామిడి పరిధిలోని శ్రీనిఖిల్ చేతనా కేంద్రంలో ప్రత్యేక హోమ పూజలు చేశారు. అనంతరం భక్తులకు ప్రవచనాలు వివరించారు. ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని సూచించారు. గృహస్తుగా నిత్యం కొంత సమయాన్ని భగవంతుడి సేవకు కేటాయించాలన్నారు. నిత్య సాధనతో సమాజంలోని ఆటుపోట్లను తట్టుకుని నిలబడవచ్చన్నారు. అనంతరం భక్తులకు గురూజీ అన్నప్రసాదాలతో పాటు ఆశీర్వాదాలు అందించారు.

దశలవారీగా సమస్యల పరిష్కారం

సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ శ్రీవాణి



ధ్వంసమైన మ్యాన్‌హోల్ పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి

హుడాకాంప్లెక్స్: సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అన్నారు. గుడ్ మార్నింగ్ సరూర్‌నగర్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆమె జీహెచ్‌ఎంసీ శానిటేషన్, ఇంజినీరింగ్, ఎంటమాలజీ, జలమండలి అధికారులతో కలిసి వెంకటేశ్వరకాలనీలో మార్నింగ్ వాక్ చేశారు. కృంగిన మ్యాన్‌హోళ్లు, గుంతలమయమైన రోడ్లు దర్శనం ఇస్తున్నాయని సంబంధిత అధికారులు స్పందించాలని కోరారు. ఈ సందర్భంగా శ్రీవాణి మాట్లాడుతూ.. అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా శానిటేషన్ సిబ్బంది చూడాలన్నారు. ఆమె వెంట పలువురు పార్టీనాయకులున్నారు.

ధర్నాకు తరలిన నాయకులు



ధర్నాకు వెళ్తున్న బీజేవైఎం నాయకులు

పహాడీషరీఫ్: బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో నిరుద్యోగ సమస్యలపై కలెక్టరేట్ ముట్టడికి శుక్రవారం జల్‌పల్లి, మామిడిపల్లి నుంచి నాయకులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, ఉద్యోగం లేని వారికి రూ.10 లక్షల రుణం ఇవ్వాలని, అవినీతికి పాల్పడిన రంగారెడ్డి డీఈఓను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాకు వెళ్లిన వారిలో ఈరంకి విశ్వనాథ్ గౌడ్, లిక్కి విజయేందర్ రెడ్డి, గౌర మురళీ కృష్ణ, హరికృష్ణ, నాగార్జున, సంతోష్, సుమిత్ తదితరులున్నారు.

తెలంగాణలో పార్టీని విస్తరించండి



వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డితో సుమన్ గౌడ్

పహాడీషరీఫ్: ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి యువజన విభాగం నాయకుడు గుర్జని సుమన్ గౌడ్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. తాడేపల్లి గూడెంలో కలిసి తెలంగాణలోనూ పార్టీ కార్యకలాపాలను కూడా విస్తరించాలని కోరానన్నారు. ఓటమితో అధైర్య పడరాదని, ప్రజా సమస్యలపై పోరాడాలని సూచించారన్నాడు.

రోడ్డు ఆక్రమణలు తొలగింపు

రామంతాపూర్: సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి కేసీఆర్‌నగర్ సర్వీస్ రోడ్డులో ఇరు వైపులా ఆక్రమించుకుని పుట్‌పాత్‌లపై ఉన్న షెడ్లను, డబ్బాలను శుక్రవారం టౌన్ ప్లానింగ్ అధికారి సురేష్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు మధ్య సిబ్బంది తొలగించారు.



కందుకూరు: సబితారెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎంపీటీసీ మాజీ సభ్యులు



హుడాకాంప్లెక్స్: శంకర్‌నగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

పచ్చదనం పెంపొందించాలి

మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి

మీర్‌పేట: వన మహోత్సవంలో భాగంగా మీర్‌పేట కార్పొరేషన్ పరిధి మంత్రాల చెరువు వద్ద శుక్రవారం చేపట్టిన కార్యక్రమానికి మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కార్పొరేషన్‌లోని చెరువుల వద్ద పెద్ద ఎత్తున మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని అధికారులకు సూచించారు. నెల రోజుల్లోగా మంత్రాల చెరువు సుందరీకరణ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, కమిషనర్ చంద్రశేఖర్, డీఈ వెంకన్న, ఏఈ శ్రీనివాసులు, ఎఫ్ఆర్ఓ సుధీర్, ఆర్ఓ అంజన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు అర్కల కామేశ్‌రెడ్డి, దిండు భూపేశ్‌గౌడ్, జెటావత్ శ్రీనునాయక్, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

కందుకూరు: ఐదేళ్ల పదవీకాలం పూర్తి చేసుకున్న ఎంపీటీసీ మాజీ సభ్యులు శుక్రవారం ఎమ్మెల్యే సబితారెడ్డిని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఐదేళ్లపాటు తమ గ్రామాల అభివృద్ధికి సహకరించినందుకు గాను పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసినవారిలో టి.ఇందిర దేవేందర్, జి.సురేశ్, కె.రాములు, ఎస్.రాజశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ టి.దేవేందర్ ఉన్నారు.



మీర్‌పేట: మంత్రాల చెరువు వద్ద మొక్క నాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

పేదలకు అండగా ఉంటాం

హుడాకాంప్లెక్స్: కాలనీవాసుల సమస్యల పరిష్కరిస్తూ పేదలకు అండగా ఉంటానని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. శుక్రవారం ఆమె జీహెచ్‌ఎంసీ అధికారులతో కలసి సరూర్‌నగర్ డివిజన్ శంకర్‌నగర్‌లో పర్యటించారు. తాగునీటి సరఫరా, శానిటేషన్ సమస్యలు పరిష్కరించాలని కాలనీ వాసులు ఎమ్మెల్యేను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శంకర్‌నగర్ వాసులు చైతన్యవంతులని, సామాజిక సేవలో ముందుంటారన్నారు. రెహానా అనే దివ్యాంగురాలికి సామాజిక సేవకురాలు నాగమణి ట్రైసైకిల్‌ను సమకూర్చగా, ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు బాలరాజు, సాలమ్మ, మురళి, రమేశ్, సీనియర్ నేతలు లోకసాని కొండల్ రెడ్డి, ఇంటూరి అంకిరెడ్డి, ఆకుల అరవింద్‌కుమార్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రేపు అవేర్ ఆస్పత్రి ప్రారంభం

సంస్థ చైర్మన్ మాధవన్‌జీ

మహేశ్వరం: మండల పరిధిలోని మొహబ్బత్‌నగర్ గ్రామ సమీపంలో ఉన్న భగవతిపురంలో అవేర్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఆస్పత్రిని ప్రారంభిస్తున్నామని అవేర్ సంస్థ చైర్మన్ మాధవన్‌జీ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత పేదలకు అవేర్ సంస్థ ఆధ్వర్యంలో ఎన్నో రకాల వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. గ్రామాలు, గిరిజన తండాల్లో ఉచితంగా ఆరోగ్య శిబిరాలు నిర్వహించి, మందులు పంపిణీ చేసి ఉచితంగా ఆపరేషన్లు చేయించామని గుర్తుచేశారు. ఆరోగ్యధామ్ పేరిట మాధవన్‌జీ ఆస్పత్రి, ఆయుర్వేదిక్, యూనాని, హోమియో, వెల్‌నెస్, యోగ శిక్షణ, ఆయుష్ కేంద్రం, ఆయుష్ పరిశోధన కేంద్రం, మెడికల్ కాలేజ్, నర్సింగ్ కాలేజ్, ల్యాబ్స్, ఫిజియోథెరపీ కాలేజ్, సేంద్రియ ఉత్పత్తుల విక్రయ కేంద్రం, అంబులెన్స్ సేవలను త్వరలో భగవతిపురంలో దశల వారీగా ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమానికి ప్రజలు, రోగులు హాజరై వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న అవేర్ సంస్థ చైర్మన్ మాధవన్‌జీ

మురుగు సమస్యను పరిష్కరించండి

కార్పొరేటర్ జంగం శ్వేతమధుకర్‌రెడ్డి

సైదాబాద్: డ్రైనేజీలు నిండిపోయి రహదారులపై మురుగునీరు పారుతుందని వెంటనే సమస్యను పరిష్కరించాలని ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతమధుకర్‌రెడ్డి వాటర్‌వర్క్స్ అధికారులకు కోరారు. డివిజన్ పరిధిలోని సింగరేణి కాలనీ వాంబే క్వార్టర్స్, ఎస్‌ఎన్‌రెడ్డి కాలనీల్లో డ్రైనేజీలు పొంగి పొర్లుతున్నాయని స్థానికులు సమాచారం ఇవ్వడంతో శుక్రవారం కార్పొరేటర్ వాటర్‌వర్క్స్ అధికారులతో కలసి ఆయా కాలనీల్లో పర్యటించి కాలనీల్లో సమస్యగా మారిన డ్రైనేజీలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా రహదారులపై నిత్యం మురుగు పారుతుండటంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు తెలిపారు. రహదారులపై నడిచి వెళ్లేందుకు కూడా కష్టంగా ఉందని, దుర్వాసన అపరిశుభ్రతతో ఇక్కట్లు పడుతున్నామని వారు వాపోయారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ సింగరేణి కాలనీ ఎస్ఎన్‌రెడ్డి కాలనీల్లో సమస్యగా మారిన డ్రైనేజీల వద్ద వెంటనే మరమ్మతులు చేయించాలని అధికారులకు సూచించారు. ఆయా డ్రైనేజీల్లో పూడిక తీయించి మురుగునీరు రహదారులపై పారకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. డ్రైనేజీ సమస్య పరిష్కారమయ్యాక రెండు కాలనీల్లో మళ్లీ పర్యటిస్తానని కార్పొరేటర్ స్థానికులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ డీజీఎం సరిత, మేనేజర్ రమ్య, బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి పాల్గొన్నారు.



సింగరేణి కాలనీలో డ్రైనేజీ ఓవర్ ఫ్లోను పరిశీలిస్తున్న జంగం శ్వేతమధుకర్‌రెడ్డి



రహదారి పక్కన పేరుకుపోయిన వ్యర్థాలు

రోడ్డు పక్కనే పొంచి ఉన్న ముప్పు

మహేశ్వరం: ఔటర్ రింగు రోడ్డు నుంచి కలెక్టర్ కార్యాలయానికి పోయే రహదారి ప్రస్తుతం ప్రమాదకరంగా మారింది. కొద్ది రోజుల కిందట కురిసిన వర్షాలకు రోడ్డు పక్కన ఉన్న మట్టి కొట్టుకపోయి గోయ్యి ఏర్ప డింది. దీంతో వాహనదారులకు గుంత కనిపించకపోవడంతో రోడ్డు దిగేటప్పుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం జనాలతో రద్దీగా ఉండే రోడ్డు ప్రమాదకరంగా మారడంతో ఇక్కట్లు తప్పడం లేవు.అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



పడకేసిన పారిశుద్ధ్యం

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలో అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా పారిశుద్ధ్యం పడకేసిందని బీఆర్ఎస్ పార్టీ మున్సిపాలిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు షర్ఫుద్దీన్ హామెద్ అన్నారు. వాదే ముస్తఫా, వాదే హుదా బస్తీలలో గత కొన్ని రోజులుగా చెత్తా చెదారాలు పడి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. బక్రీద్ పండుగ ముగిసి పక్షం రోజులవుతున్నా ఇంకా అక్కడక్కడ వ్యర్థాలు పడి ఉండడం అధికారుల అలసత్వానికి నిదర్శనంగా నిలుస్తుందన్నారు. వ్యర్థాలు పడేసేందుకు కవర్లను కూడా పూర్తి స్థాయిలో పంపిణీ చేయని కారణంగా, స్థానికులు అవగాహన రాహిత్యంతో చిన్న చిన్న కవర్లలో తీసుకొచ్చి ఓపెన్ చెత్త పాయింట్ల వద్ద పడేస్తున్నారన్నారు. అసలే వర్షాకాలం కావడం, ఆపై ఇలా పారిశుద్ధ్యం పడకేయడంతో అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్ కింద రూ.64 లక్షల నిధులకు పాలక మండలి ఆమోదం తెలిపినా ఇప్పటికీ టెండర్ ప్రక్రియ జరగకపోవడం ఎంత వరకు సమంజసమన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి వ్యర్థాలను తొలగించడంతో పాటు దోమల నివారణ కోసం ఫాగింగ్ చేయాలని షర్ఫుద్దీన్ హామెద్, సయ్యద్ హుస్సేన్‌లు కోరారు.

శిథిలావస్థకు చేరిన బీజేఆర్ భవన్

- చిన్నపాటి వర్షానికే లీకేజీలు
- పునరుద్ధరణకు నోచుకోని వైనం

హుడాకాంప్లెక్స్: సభలు, సమావేశాలు, అనేక చర్చలకు వేదికగా నిలిచిన సరూర్‌నగర్‌లోని బీజేఆర్ భవన్ నిర్వహణ లేక నేడు శిథిలావస్థకు చేరింది. చిన్నపాటి వర్షానికే స్లాబు నుంచి నీరు కారుతోంది. గోడలకు పగుళ్లు ఏర్పడ్డాయి. ఇక్కడికి వచ్చిన వారికి దాహం వేస్తే గుక్కెడు నీటి కోసం ప్రైవేటు దుకాణాల వెంట పరుగులు తీయాల్సి వస్తోంది.

23 ఏళ్లకే శిథిలావస్థకు..

సరూర్‌నగర్ సర్కిల్‌లో 2001లో అప్పటి ప్రభుత్వం సభలు సమావేశాల కోసం బాబు జగ్జీవన్ రావు పేరున(బీజేఆర్) రూ.కోటి అంచనా వ్యయంతో రెండు ఎకరాల విస్తీర్ణంలో భవనాన్ని నిర్మించింది. సుమారు 500 మంది కూర్చొనే విధంగా వేదిక సహా సమావేశ మందిరాన్ని నిర్మించింది. ప్రధాన రహదారికి ఆనుకుని ఉండటంతో ఇక్కడ సమావేశాలు ఏర్పాటు చేసేందుకు ప్రతి ఒక్కరూ ఆసక్తి చూపుతుంటారు. ప్రజా సంఘాలు, ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీలు ఇదే వేదికగా పలు సభలు, సమావేశాలు, వార్షికోత్సవాలు నిర్వహిస్తుంటారు.

మంచినీటికి దిక్కులేదు

సమావేశ మందిరాన్ని స్వల్ప ధరకే అద్దెకు ఇస్తుంటారు. ఆరు గంటలకు రూ.5వేలు ఛార్జీ చేస్తున్నారు. వచ్చిన ఈ డబ్బులు కేవలం సెక్యూరిటీ, శానిటేషన్ వర్కర్ల వేతనాల చెల్లింపులకే సరిపోతుంది. చిన్న చిన్న రిపేర్లకు ప్రభుత్వంపై ఆధారపడాల్సి వస్తోంది. ఏళ్లుగా నిర్వాహణ ఖర్చులు ఇవ్వక పోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. బోరు ఉన్నప్పటికీ..నీరు లేదు. కృష్ణావాటర్ కనెక్షన్ కూడా లేదు. దీంతో ప్రజా సంఘాల నిర్వాహకులే ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పించుకోవాల్సి వస్తోంది.

భవనాన్ని పరిశీలించిన మాజీ మంత్రి సబిత

శిథిలావస్థకు చేరిన బీజేఆర్ భవనాన్ని మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి రెండు రోజుల క్రితం సందర్శించారు. పునరుద్ధరణ పనుల కోసం గతంలో రూ.3.50 కోట్లతో ప్రతిపాదించిన నిధులను మంజూరు చేయించాను. కానీ పనులు ప్రారంభించలేదు. మరోసారి అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి నివేదిక పంపాల్సిందిగా సంబంధిత విభాగం అధికారికి ఆదేశాలు జారీ చేశారు.



బీజేఆర్ భవన్ పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

ప్రదర్శనలకు అవకాశం ఇవ్వాలి

బీజేఆర్ భవనాన్ని కళా ప్రదర్శనల కోసం కేటాయించాలి. సూక్ష్మ కళా రూపాల ప్రదర్శనకు ఉచితంగా అవకాశం కల్పించాలి. శివారు ప్రాంతాల్లోని వారికి తమ కళలను ప్రదర్శించేందుకు రవీంద్ర భారతి వరకు వెళ్లాల్సి వస్తోంది. ఇది భారంగా మారుతోంది. సరూర్‌నగర్‌లోని అందరికీ అందుబాటులో ఉన్న ఈ భవనాన్ని కేటాయించాలి.

– ముంజంపల్లి విద్యాధర్, ఆర్టిస్టు

రాజరాజేశ్వరి దేవికి ప్రత్యేక పూజలు

మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. రాజేశ్వరీ దేవి అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, మంత్ర పుష్పం, పుష్పాలంకరణ తదితర పూజలు నిర్వహించారు. శివుడి ప్రత్యేక అభిషేకాలు చేశారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అల్లె కుమార్, డైరెక్టర్లు, ఆలయ ప్రధాన పూజారులున్నారు.



ప్రత్యేక అలంకరణ శ్రీరాజరాజేశ్వరీదేవి

విద్యారంగాన్ని విస్మరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు



పోస్టర్ విడుదల చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

మలక్‌పేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని పూర్తిగా విస్మరిస్తున్నాయని పీడీఎస్‌యూ గ్రేటర్ హైద్రాబాద్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మంద నవీన్, పొడపంగి నాగరాజు అన్నారు. ఈనెల 6 తేదీన సంగారెడ్డిలో నిర్వహించనున్న పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని కోరుతూ శుక్రవారం దిల్‌సుఖ్‌నగర్‌లో వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అణగారిన వర్గాల విద్యార్థులకు విద్య అందకుండా విద్యరంగాన్ని ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన జాతీయ విద్యావిధానం-2020 తీసుకొచ్చి శ్రామిక వర్గాల పిల్లలను, పేద విద్యార్థులను విద్యకు దూరం చేసే కుట్ర జరుగుతుంద న్నారు. యూనివర్సిటీలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశా రు. బడ్జెట్‌లో విద్యారంగానికి నిధులు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మధు, రమేష్, హర్ష, కిరణ్, సందీప్ , హరీష్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

చంపాపేటలో జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి పర్యటన

చంపాపేట: పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి ఆదేశించారు. గురువారం ఎల్బీనగర్ జోనల్ కమిషనర్‌తో కలసి ఆమె శుక్రవారం చంపాపేట డివిజన్‌లో పర్యటించి పెండింగ్ పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. రెడ్డిబస్తీ కాలనీలో జీహెచ్‌ఎంసీ నిధులతో పూర్తి అయిన మినీ ఫంక్షన్ హాల్, సుల్తానా అల్వా కాలనీలో అసంపూర్తి దశలో ఉన్న మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌ను పరిశీలించిన అనంతరం ఆమె వనస్థలిపురంలోని సుష్మా హాకీ స్టేడియాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, డీసీ జాకియా సుల్తానా, ఇతర సర్కిల్ అధికారులు పాల్గొన్నారు.

మొక్కలు నాటడం సామాజిక బాధ్యత



విద్యార్థులతో కలసి మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

మూసారాంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి

మలక్‌పేట: ప్రతీ ఒక్కరూ సామాజిక బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షణ చేయాలని మూసారాంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి అన్నారు. శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్‌ను పురస్కరించుకుని చేపట్టిన కార్యక్రమాల్లో భాగంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం కార్పొరేటర్ ఫ్రెండ్స్ కాలనీలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు 'అమ్మ పేరుతో ఒక మొక్క' (ఏక్ పేడ్ మా కే నామ్) అనే నినాదంతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతగా తీసుకోవాలన్నారు. భవిష్యత్ తరాల కోసం మొక్కలు విరివిరిగా నాటి పెంచి పెద్ద చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ భాగ్యనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి సందడి సురేందర్‌రెడ్డి, రాముయాదవ్, కొంగర ప్రవీణ్, ఉదయ్, మల్లేష్, సంతోష్, జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్తిరెడ్డి, యూబీడీ సూపర్‌వైజర్ కృష్ణ పాల్గొన్నారు.